ఆప్ నేత సత్యేందర్ జైన్‌కు బెయిల్

దాదాపు రెండేండ్ల తర్వాత మంజూరు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: మనీ లాండరింగ్ కేసులో దాదాపు రెండేండ్ల తర్వాత ఆప్ నేత, మాజీ మంత్రి సత్యేందర్ జైన్‌కు ఢిల్లీ కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. విచారణలో జాప్యం, సుదీర్ఘకాలం విచారణ ఖైదీగా ఉన్నందున ఆయనకు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు పేర్కొంది. తనకు సంబంధించిన నాలుగు కంపెనీల ద్వారా మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆయనను 2022 మే 30న అరెస్ట్ చేసింది. ఈ కేసుకు సంబంధించి సుదీర్ఘకాలంగా విచారణ సాగుతున్నదని, నిందితుడు 18 నెలలుగా రిమాండ్ ఖైదీగా ఉన్నందున అతడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్టు జడ్జి విశాల్ గోగ్నే తెలిపారు.

త్వరలో సుప్రీంకోర్టులో కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్!

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ తాను చేపట్టే అన్ని కేసుల విచారణను త్వరలో ప్రత్యక్ష ప్రసారం చేయడానికి సుప్రీంకోర్టు ప్రణాళికలు రూపొందిస్తున్నది. బార్ & బెంచ్ నివేదిక ప్రకారం ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ధర్మాసనాల ప్రొసీడింగ్స్‌ను ప్రత్యక్ష ప్రసారం చేసే యాప్‌ను పరీక్షిస్తున్నారు. రాజ్యాంగ ధర్మాసనం ప్రొసీడింగ్స్‌ను 2022 నుంచి లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నారు. అయితే నెల క్రితం సుప్రీంకోర్టు యూట్యూబ్ ఛానల్ హ్యాకింగ్‌కు గురైన నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారాలకు సంబంధించి సైబర్ భద్రతను పకడ్బందీగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.

భారతీయులకు యూఏఈ వీసా ఆన్ అరైవల్

న్యూఢిల్లీ: యూఎస్, యూకే, ఈయూకు చెందిన శాశ్వత నివాస కార్డులు(పీఆర్‌సీ) లేదా వీసాలు కలిగిన భారతీయులకు యూఏఈ 14 రోజుల వీసా ఆన్ అరైవల్ (ఎయిర్‌పోర్ట్‌లోనే వీసా జారీ చేయడం) విధానాన్ని ప్రారంభించింది. సుమారు 35 లక్షల మంది భారతీయులు నివసిస్తున్న యూఏఈ-భారత్ మధ్య పెరుగుతున్న భాగస్వామ్యంలో భాగంగా యూఏఈ ఈ నిర్ణయం తీసుకుంది. వీసా ఆన్ అరైవల్ పొందాలనుకొనేవారు కనీసం 6 నెలల చెల్లుబాటు కలిగిన పాస్‌పోర్ట్ కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం తగిన పాస్‌పోర్ట్, వీసా, శాశ్వత నివాస కార్డులు కలిగిన వారికి 14 రోజుల వీసా ఆన్ అరైవల్ జారీ చేస్తారు.

బాల్య వివాహాల కట్టడికి సుప్రీం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ: బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేయడానికి సుప్రీం కోర్టు మార్గదర్శకాలను విడుదల చేసింది. పర్సనల్ లాతో సంబంధం లేకుండా దీనిని అమలు చేయాలని పేర్కొంది. బాల్య వివాహ నిరోధక చట్టం (పీసీఎంఏ) అమలును వ్యక్తిగత చట్టాల కిందకు వచ్చే సంప్రదాయాలు నిరోధించ లేవని, అంతేకాకుండా అది జీవిత భాగస్వామిని ఎన్నుకునే స్వేచ్ఛను హరిస్తాయని సుప్రీం కోర్టు శుక్రవారం తన తీర్పులో పేర్కొంది. కేవలం ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారిని శిక్షించడం పైనే దృష్టి పెట్టకుండా దీని అమలుకు అధికార యంత్రాంగం విశేష కృషి చేయాలని సూచించింది.

పన్నూ హత్యకు 'రా' అధికారి కుట్ర!

అగ్రరాజ్యం ఆరోపణ.. ఖండించిన భారత్

వాషింగ్టన్: అమెరికాలో నిరుడు ప్రధాని నరేంద్రమోదీ పర్యటన సందర్భంగా అమెరికన్ జాతీయుడైన సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్‌సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగినట్టు చెప్తున్న అగ్రరాజ్యం.. ఆ కుట్రలో భారత విదేశీ నిఘా సంస్థ 'రా' (రిసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్) అధికారి వికాస్ యాదవ్ (39) ప్రమేయం ఉన్నట్టు తాజాగా ఆరోపించింది. ఈ మేరకు గురువారం న్యూయార్క్‌లోని కోర్టులో అభియోగ పత్రాన్ని దాఖలు చేసింది. 'రా'ను నడిపే క్యాబినెట్ సెక్రటేరియట్‌లో వికాస్ యాదవ్ ఉద్యోగిగా పని చేశారని, ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియడం లేదని అమెరికన్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆ చార్జిషీట్‌లో పేర్కొన్నారు. హత్యకు ప్రణాళిక రచించడం, ఆ ప్రణాళిక అమలుకు వ్యక్తులను నియమించడంతోపాటు మనీ లాండరింగ్‌కు పాల్పడేందుకు కుట్ర పన్నినట్టు వికాస్ యాదవ్‌పై అభియోగాలు మోపారు. కాగా, అగ్రరాజ్యం ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది.

హమాస్ కొత్త చీఫ్ ఎవరు?

సిన్వార్ సోదరుడు సహా రేసులో ఐదుగురు


ఖలేద్ మషల్

జెరూసలేం, అక్టోబర్ 18: హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను హతమార్చినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అక్టోబర్ 7న గాజాలో జరిపిన దాడుల్లో సిన్వర్ మరణించినట్టు తాజాగా ప్రకటించింది. ఏడాది క్రితం ఇజ్రాయెల్‌పై దాడి చేసిన తర్వాత ఉగ్రవాద, రాజకీయ సంస్థ అయిన హమాస్ దారుణంగా నష్టపోయింది. జూలైలో ఇస్మాయిల్ హనియా, తాజాగా సిన్వర్ ఇజ్రాయెల్ దాడుల్లో మరణించడంతో ఇప్పుడు హమాస్‌ను నడిపించే నాయకుడు కరువయ్యాడు. ఈ నేపథ్యంలో హమాస్ కొత్త అధినేత రేసులో ఐదుగురి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

మహమ్మద్ సిన్వర్

హమాస్ కాబోయే అధినేతగా యాహ్యా సిన్వర్ తమ్ముడు మహమ్మద్ సిన్వర్(49) పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. హమాస్ మిలిటరీ కమాండర్లలో మహమ్మద్ కీలక వ్యక్తి. 2011లో ఇజ్రాయెల్ సైనికుడు గిలాద్ షలిత్‌ను మహమ్మద్ సిన్వర్ అపహరించాడు. తమ సైనికుడిని క్షేమంగా తెచ్చుకునేందుకు యాహ్యా సిన్వర్‌తో పాటు దాదాపు వెయ్యి మంది పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ విడుదల చేయాల్సి వచ్చింది.

ఖలిక్ అల్‌హయ్యా

ఖలిక్ అల్‌హయ్యా ఖతార్ కేంద్రంగా హమాస్ కోసం పని చేస్తాడు. హమాస్ రాజకీయ విభాగంలో కీలక వ్యక్తి. దోహాలో జరిగిన కాల్పుల విరమణ చర్చల్లో కీలకంగా వ్యవహరించాడు. జూలైలో హమాస్ నేత ఇస్మాయిల్ హనియాను ఇజ్రాయెల్ హతమార్చినప్పుడు కూడా హమాస్‌కు నాయకత్వం వహించబోతున్నాడని ఖలిక్ పేరు వినిపించింది. 2007లో గాజాలో తన ఇంటి మీద జరిగిన దాడి నుంచి ఖలిక్ తృటిలో ప్రాణాలతో బయటపడ్డాడు.

మహ్‌మౌద్ అల్‌జహార్

హమాస్ వ్యవస్థాపకుల్లో జహర్ ఒకడు. గాజాలో వైద్యుడిగా పని చేయడంతో పాటు హమాస్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. 2006లో పాలస్తీనియన్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికవడంతో పాటు విదేశాంగ శాఖ మంత్రిగా పని చేశాడు. అయితే, జహర్ కూడా అక్టోబర్ 7 నుంచి కనిపించడం లేదని తెలుస్తున్నది.

మౌసా అబు మర్జౌక్

హమాస్ ఏర్పాటుకు కారణమైన ముస్లిం బ్రదర్‌హుడ్ ఏర్పాటులో మర్జౌక్‌ది కీలక పాత్ర. హమాస్ రాజకీయ విభాగంలో కీలక సభ్యుడిగా ఉన్నాడు. ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడ్డాడనే ఆరోపణలతో 1990లలో అమెరికాలోని మన్‌హట్టన్ జైలులో రెండేండ్లు శిక్ష అనుభవించాడు. తర్వాత అమెరికా శాశ్వత నివాసాన్ని వదులుకొని జోర్డన్‌లో స్థిరపడ్డాడు.

మౌసా అబు అల్‌జహార్

ఖలేద్ మషల్

1996లో హమాస్ రాజకీయ విభాగానికి అధినేతగా మషల్ పని చేశాడు. రెండేండ్ల తర్వాత జోర్డన్‌లో మషల్‌కు ఇజ్రాయెల్ స్లో పాయిజన్ ఇవ్వడంతో కోమాలోకి వెళ్లాడు. తర్వాత జోర్డన్‌తో జరిగిన దౌత్య ఒప్పందంలో భాగంగా మషల్‌కు ఇజ్రాయెల్ యాంటీడోస్ ఇవ్వడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. మషల్ ప్రస్తుతం ఖతర్‌లో నివశిస్తున్నట్టు తెలుస్తున్నది.

బందీలను వదిలేస్తే రేపే యుద్ధ విరమణ

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆఫర్

జెరూసలేం, అక్టోబర్ 18: హమాస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను హతమార్చిన నేపథ్యంలో గాజా ప్రజలను ఉద్దేశించి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయుధాలను వదులుకొని, బందీలను విడిచిపెట్టేందుకు హమాస్ అంగీకరిస్తే రేపే యుద్ధం ముగుస్తుందని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. 'యాహ్యా సిన్వర్ మరణించాడు. రఫాలో ధైర్యవంతులైన ఇజ్రాయెల్ సైనికులు ఆయనను చంపేశారు. అయితే, ఇది గాజాలో యుద్ధానికి ముగింపు మాత్రం కాదు. యుద్ధం ముగిసే ప్రక్రియకు ఆరంభం మాత్రమే. హమాస్ ఆయుధాలను, బందీలను విడిచిపెడితే రేపే యుద్ధం ముగుస్తుంది. గాజా ప్రజలకు ఇది నా స్పష్టమైన సందేశం' అని నెతన్యాహూ పేర్కొన్నారు. ప్రస్తుతం హమాస్ వద్ద ఇజ్రాయెల్ సహా 23 దేశాలకు చెందిన 101 మంది పౌరులు బందీలుగా ఉన్నారని నెతన్యాహూ తెలిపారు. బందీలను తిరిగి తీసుకురావడానికి ఇజ్రాయెల్ కట్టుబడి ఉందని, బందీలను అప్పగించిన వారి రక్షణకు తమది భరోసా అని పేర్కొన్నారు.

నెతన్యాహూ

యుద్ధం ఆగే వరకు బందీలను వదిలిపెట్టం: హమాస్

యాహ్యా సిన్వర్ మరణించిన విషయాన్ని హమాస్ శుక్రవారం ధ్రువీకరించింది. సిన్వర్ వీరోచిత అమరుడని, ఆయుధాన్ని వదలకుండా సైన్యాన్ని ముందుండి నడిపించారని హమాస్ ప్రతినిధి ఖలిల్ అల్ హయ్యా ప్రకటించారు. కాగా, గాజాలో ఇజ్రాయెల్ కాల్పులను విరమించి, సైన్యాన్ని వెనక్కు తీసుకెళ్తే తప్ప బందీలను విడిచిపెట్టబోమని హమాస్ స్పష్టం చేసింది.

వెంటాడి.. వేటాడి!

గాజా యుద్ధం ప్రారంభమైన ఏడాది కాలంలో హమస్ చీఫ్ యాహ్యా సిన్వర్‌ను హతమార్చడం తమకు లభించిన భారీ విజయమని ఇజ్రాయెల్ ప్రకటించింది. తప్పించుకొనే క్రమంలో సిన్వర్ దక్షిణ గాజాలో ఒక ఇంటి నుంచి మరో ఇంటికి తన మకాం మారుస్తూ వెళ్తున్నాడని, ఈ క్రమంలో అతడిని వెంటాడి వేటాడామని తెలిపింది. ఇజ్రాయెల్‌లో గత ఏడాది అక్టోబర్ 7న మారణహోమం సృష్టించిన హమస్ ఉగ్రవాదుల కుట్రకు సిన్వర్ ప్రధాన సూత్రధారి అని పేర్కొంది. ఈ నెల 16న తమ దక్షిణ కమాండ్‌కు చెందిన సైనికులు సిన్వర్‌ను మట్టుబెట్టారని ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రాంతంలో గత ఏడాది నుంచి సిన్వర్ కోసం గాలింపు నిర్వహిస్తున్నామని పేర్కొంది. ఇటీవలి కాలంలో తాము వెతుకుతున్న ప్రదేశాల సంఖ్య తగ్గుతుండటం, సిన్వర్ నివాస ప్రాంతాన్ని తమ దళాలు చుట్టుముడుతుండటంతో ఇక అతడికి పారిపోయే అవకాశం లేకపోయిందని వివరించింది. ఒక ఇంటిలో నివసిస్తున్న ముగ్గురు ఉగ్రవాదులను తమ 828 బ్రిగేడ్‌కు చెందిన సైనికులు గుర్తించి, దాడి చేశారని తెలిపింది. దాడుల అనంతరం వెళ్లి పరిశీలించగా, అక్కడ సిన్వర్ హతమై ఉన్నాడని పేర్కొంది. రఫా జిల్లాలో సిన్వర్‌తోపాటు మరో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారని ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి హగారీ ధ్రువీకరించారు. తమ దళాలు గాలింపు జరుపుతుండగా ముగ్గురు ఉగ్రవాదులు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి పారిపోతూ కనిపించారని చెప్పారు. తమ దళాలు వారిపై కాల్పులు జరుపడంతో సిన్వర్ ఒంటరిగా మరో ఇంట్లోకి వెళ్లిపోయాడని తెలిపారు. అతడున్న ఇంటిని డ్రోన్ సాయంతో స్కాన్ చేశామని, తన ఎదుటికి వచ్చిన డ్రోన్ పైకి సిన్వర్ ఒక కర్రను విసిరాడని వివరించారు. సిన్వర్ మరణించిన ప్రదేశంలో ఇజ్రాయెల్‌కు చెందిన బందీలెవరూ లేరని చెప్పారు. సిన్వర్ మృతదేహం వద్ద ఒక గన్, 40వేల షెకెల్స్ (పాలస్తీనా కరెన్సీ) లభించాయని తెలిపారు.


సిన్వర్

రష్యాకు 12 వేల ఉత్తర కొరియా బలగాలు

ఉక్రెయిన్‌పై పోరుకు సహాయంగా పంపిన కిమ్!

తీవ్రంగా తప్పుబట్టిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

సియోల్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సహాయంగా ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన సైనిక బలగాలను పంపారని దక్షిణకొరియా నిఘా సంస్థ పేర్కొంది. ఈ చర్య ఉత్తర కొరియా, పశ్చిమ దేశాల మధ్య ప్రతిష్టంభనను మరింత తీవ్రతరం చేసిందని విమర్శించింది. రష్యా నౌకాదళానికి చెందిన షిప్పుల ద్వారా ఈ నెల 8 నుంచి 13 మధ్య ఉత్తర కొరియాకు చెందిన 1,500 ప్రత్యేక ఆపరేషన్ దళాలను రష్యా పోర్టు సిటీకి తరలించినట్టు నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్ (ఎన్ఐఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. త్వరలోనే మరిన్ని ట్రూప్‌లు రష్యాకు వెళ్లనున్నట్టు వెల్లడించింది.

అలా జరిగితే మూడో ప్రపంచ యుద్ధమే: జెలెన్‌స్కీ

రష్యా సైన్యంలో 10 వేల మంది ఉత్తర కొరియా సైనికులు చేరేందుకు ఏర్పాట్లు జరిగినట్టు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యాతో తాము చేస్తున్న యుద్ధంలో మూడో దేశం జోక్యం చేసుకుంటే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయొచ్చని హెచ్చరించారు.

బినామీ చట్ట సవరణలపై తీర్పు ఉపసంహరణ

2022 నాటి తీర్పును నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం-1988లో చేసిన సవరణలు రాజ్యాంగవిరుద్ధమని పేర్కొంటూ 2022లో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారం ఉపసంహరించుకుంది. 2016లో ప్రభుత్వం ఈ చట్టానికి సవరణలు చేసింది. ఇందులో చేర్చిన సెక్షన్ 3(2) కింద మూడేండ్ల జైలు శిక్ష విధించవచ్చు. చట్ట సవరణ చేసిన రోజు నుంచి కాకుండా చట్టాన్ని చేసిన 1988 సెప్టెంబర్ 5 నుంచి అమలయ్యేలా ఈ సెక్షన్ ఉంది. దీంతో పాటు బినామీ లావాదేవీగా గుర్తించిన ఆస్తిని జప్తు చేసే అధికారాన్ని కేంద్రానికి అప్పగిస్తూ సెక్షన్ 5ను చేర్చింది. ఈ రెండు సెక్షన్లపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు కాగా, అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ చట్ట సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, ఏకపక్షంగా ఉన్నాయని 2022 ఆగస్టు 23న సుప్రీంకోర్టు ప్రకటించింది. ఈ తీర్పును కేంద్ర ప్రభుత్వంతో పాటు ఐటీ(బినామీ నిషేధం) డిప్యూటీ కమిషనర్ సవాల్ చేశారు. ఈ అంశాన్ని శుక్రవారం విచారించిన ధర్మాసనం విచారణకు ప్రత్యేక ధర్మాసనాన్ని నియమించనున్నట్టు తెలిపింది.

విద్యుత్తు కమిషన్లను రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించలేవు

సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబర్ 18: రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పని చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విద్యుత్తు చట్టం 2003లోని సెక్షన్ 108 ప్రకారం విధానపరమైన ఆదేశాలు ఇచ్చి కమిషన్‌లను ప్రభుత్వాలు ప్రభావితం చేయలేవని పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్తు నియంత్రణ కమిషన్‌లకు కేవలం సూచనలు మాత్రమే చేయగలవని కోర్టు తెలిపింది. ఏడు విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల(పీఎస్ఏ)ల కోసం కేరళ ప్రభుత్వం కేరళ రాష్ట్ర విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్(కేఎస్ఈఆర్సీ) ఆమోదాన్ని కోరింది. అయితే, నాలుగు పీఎస్ఏల విషయంలో కేరళ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు(కేఎస్ఈబీ) సరైన మార్గదర్శకాలను పాటించలేదని కేఎస్ఈఆర్సీ తిరస్కరించింది. దీంతో నాలుగు పీఎస్ఏలకు ఆమోదం తెలపాలని సెక్షన్ 108 కింద కేరళ ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో కేఎస్ఈఆర్సీ ఆమోదం తెలిపింది. దీనిపై ఇద్దరు విద్యుత్తు ఉత్పత్తిదారులు ఏపీటీఈఎల్‌లో అప్పీల్ చేశారు. దీంతో కేఎస్ఈఆర్సీ ఉత్తర్వును ఏపీటీఈఎల్ రద్దు చేసింది. దీనిని సవాల్ చేస్తూ కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఏపీటీఈఎల్ తీర్పుతో ఏకీభవించిన సుప్రీంకోర్టు.. సెక్షన్ 108 కింద రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు నియంత్రణ కమిషన్లను నియంత్రించలేవని స్పష్టం చేసింది.

ఓటుకు రూ.500 పంచుదాం

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆడియో వైరల్

లోక్‌సభ ఎన్నికల వ్యవహారం బట్టబయలు

బెంగళూరు, అక్టోబర్ 18: లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక కాంగ్రెస్ పార్టీ డబ్బు పంపిణీ వ్యవహారం బట్టబయలైంది. డబ్బు ఎలా పంచాలో పార్టీ కార్యకర్తలకు అర్సికేరె ఎమ్మెల్యే కేఎం శివలింగగౌడ సూచిస్తున్నట్టుగా ఉన్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'సీఎం, డిప్యూటీ సీఎం చెప్పినట్టుగా డబ్బు పంచాలి. శ్రేయస్ పటేల్(హాసన్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి) రూ.5 కోట్లు, మాజీ ఎమ్మెల్సీ గోపాలస్వామి కోటి రూపాయలు, నేను కోటి రూపాయలు ఇస్తా. మొత్తం రూ.7 కోట్లు సరిగ్గా పంచాలి. ఓటుకు రూ.500 చొప్పున ఇవ్వండి. ఇతర పార్టీలకు ఓటు వేస్తారని అనుకునే వారికి డబ్బులు పంచకండి. ఇది సీఎం, డిప్యూటీ సీఎం నిర్ణయం' అని శివలింగగౌడ పార్టీ నేతలతో మాట్లాడినట్టుగా ఈ ఆడియో ఉంది. ఎన్నికల వేళ లీకైన హాసన్ జేడీఎస్ అభ్యర్థి ప్రజ్వల్ రేవణ్ణ అశ్లీల వీడియోల వ్యవహారంపైనా ఇందులో చర్చ జరిగింది. 'వాటిని సరిగ్గా వినియోగించుకోవాలి. వీడియో లీక్ అయిన తర్వాత కుమారస్వామి ప్రచారానికి రాలేదు. దేవెగౌడ ఈ వయసులో ప్రచారానికి రాలేరు.' అంటూ ఆయన చెప్పుకొచ్చారు.

ముడా కార్యాలయంలో ఈడీ సోదాలు

బెంగళూరు, అక్టోబర్ 18: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కార్యాలయంతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు నిర్వహించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణి బీఎం పార్వతికి ముడా కేటాయించిన స్థలాల విషయంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్న సంగతి తెలిసిందే. తక్కువ విలువ కలిగిన భూమిని ముడాకు అప్పగించి, ప్రతిగా 14 విలువైన స్థలాలను పొందారని బీఎం పార్వతిపై ఆరోపణలు వచ్చాయి. ముడాకు అప్పగించిన 3.16 ఎకరాల స్థలంపైనా ఆమెకు న్యాయమైన హక్కు లేదనే వాదనలూ ఉన్నాయి. ఈ వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్యపై ఇప్పటికే లోకాయుక్త పోలీసులతో పాటు ఈడీ కేసు నమోదు చేసి విచారిస్తున్నాయి. విచారణలో భాగంగా శుక్రవారం సీఆర్పీఎఫ్ పహారాతో మైసూరులో ముడా కార్యాలయంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి, ముడా కుంభకోణానికి సంబంధించిన పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈడీ సోదాలను బీజేపీ, జేడీఎస్ స్వాగతించాయి.

తమిళనాడులో 'ద్రవిడ' వివాదం

- గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలని కేంద్రప్రభుత్వానికి సీఎం స్టాలిన్ డిమాండ్
- రాష్ట్ర గీతంలో ద్రవిడ పదాన్ని ఉద్దేశపూర్వకంగా పలకలేదని గవర్నర్‌పై తీవ్ర ఆగ్రహం
- తమిళ నాడు ప్రజలను అవమానించారని ధ్వజం
- జాతీయ గీతంలోనూ ద్రవిడ పదాన్ని పలకకుండా దాటవేసే దమ్ముందా అని గవర్నర్‌కు సవాల్

చెన్నై, అక్టోబర్ 18: తమిళనాడులో మరోసారి ప్రభుత్వానికి, గవర్నర్ మధ్య తీవ్ర వివాదం రేగింది. జాతీయ సమైక్యతను అవమానించిన రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవిని రీకాల్ చేయాలంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గవర్నర్ హాజరైన ఒక కార్యక్రమంలో ఆలపించిన తమిళ రాష్ట్ర గీతంలో గవర్నర్ ఉద్దేశపూర్వకంగా 'ద్రవిడ' అనే పదాన్ని పలకకుండా దాటవేశారని స్టాలిన్ ఆరోపించారు. గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరైన చెన్నై దూరదర్శన్ స్వర్ణోత్సవ వేడుకలో ఇది చోటు చేసుకుంది. 'ద్రవిడియన్ అలర్జీతో గవర్నర్ బాధపడుతున్నారా? అందుకే ఆయన తమిళ గేయం నుంచి ద్రవిడ అన్న పదాన్ని తొలగించారా?' అని స్టాలిన్ ప్రశ్నించారు. జాతీయ గీతంలోనూ ద్రవిడ అనే పదాన్ని దాటవేసే దమ్ము గవర్నర్‌కు ఉందా అని సవాల్ చేశారు. ఉద్దేశపూర్వకంగా తమిళుల మనోభావాలను దెబ్బతీసిన గవర్నర్‌ను కేంద్రం వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం ఆరోపణలను గవర్నర్ కార్యాలయం ఖండించింది. గవర్నర్ కేవలం ఆ కార్యక్రమానికి హాజరయ్యారని, గీతాన్ని ఆలపించిన ట్రూప్ ద్రవిడ పదాన్ని దాటవేసిందని వివరణ ఇచ్చింది. దీనిపై దూరదర్శన్ తమిళ్ క్షమాపణలు చెబుతూ గాయకుల పరధ్యానం కారణంగానే అది జరిగిందని పేర్కొంది. తమ కారణంగా గవర్నర్‌కు జరిగిన ఇబ్బంది పట్ల క్షమాపణలు కోరింది.

హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ భాష ఉత్సవాలు వద్దు

హిందీయేతర రాష్ట్రాల్లో హిందీ భాషా కార్యక్రమాలు నిర్వహించాలన్న నిర్ణయాన్ని పునః పరిశీలన చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక లేఖ రాస్తూ చెన్నై దూరదర్శన్ స్వర్ణోత్సవ వేడుకలు, హిందీ మాసం ముగింపు వేడుకలను సంయుక్తంగా నిర్వహించాలన్న కేంద్రం ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందీ మాట్లాడని రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆయా భాషలను కించపరచడమేనని, ఈ క్రమంలో హిందీ మాసం వేడుకల నిర్వహణను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. అలా కాకుండా హిందీయేతర రాష్ట్రాల్లో ఆయా రాష్ట్రాల భాషా దినోత్సవాలను నిర్వహించి ప్రోత్సహించాలని స్టాలిన్ సూచించారు.

కేంద్రమంత్రి ప్రహ్లాద్ కుటుంబంపై చీటింగ్ కేసు

పార్టీ టికెట్ పేరుతో రూ.2.5 కోట్లు మోసం

పోలీసులకు జేడీఎస్ నేత ఫిర్యాదు

బెంగళూరు, అక్టోబర్ 18: కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోగా, విపక్ష బీజేపీ కూడా తామేమీ తక్కువ తినలేదని నిరూపించుకుంటున్నది. కర్ణాటకకు చెందిన కేంద్ర మంత్రి, బీజేపీ నేత ప్రహ్లాద్ జోషి కుటుంబ సభ్యులపై మోసం, కుల దూషణ, బెదిరింపు ఆరోపణలపై గురువారం కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల్లో తనకు బీజేపీ టికెట్ ఇప్పిస్తానంటూ మంత్రి ప్రహ్లాద్ జోషీ సోదరుడు గోపాల్, సోదరి విజయలక్ష్మి జోషి, మేనల్లుడు అజయ్ జోషి తన నుంచి రూ.2.5 కోట్ల తీసుకున్నారంటూ మాజీ ఎమ్మెల్యే దేవానంద్ చవాన్, అతని భార్య సునీత చవాన్ ఫిర్యాదు చేశారు. ఆ డబ్బును అమిత్ షా కార్యదర్శికి అందజేయాల్సి ఉందని గోపాల్ తనతో చెప్పారని బాధితురాలు తెలిపింది. ప్రహ్లాద్ జోషీకి కేంద్రంలో మంచి పలుకుబడి ఉందని, ప్రధాని మోదీ, అమిత్ షా అతని మాట వింటారని నమ్మించాడన్నారు. తర్వాత టికెట్ రాకపోవడంతో తమ డబ్బు గురించి అడగ్గా తమను దూషించి బెదిరించినట్టు చెప్పారు.

క్యాన్సర్ ఆటకట్టించే వ్యాక్సిన్!

బ్యాక్టీరియాతో తయారీ.. రోగికి తగ్గట్టుగా మార్చే వీలు ● అభివృద్ధి చేసిన కొలంబియా యూనివర్సిటీ పరిశోధకులు

న్యూయార్క్, అక్టోబర్ 18: క్యాన్సర్ వ్యాధి చికిత్స దిశగా అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. ప్రాణాంతక క్యాన్సర్‌ను నివారించే బ్యాక్టీరియల్ వ్యాక్సిన్‌ను వీరు అభివృద్ధి చేశారు. ఈ వ్యాక్సిన్‌కు సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ. కొలి బ్యాక్టీరియాను మార్చి ఈ వ్యాక్సిన్‌లో ఉపయోగించారు. క్యాన్సర్ కణాలపై దాడి చేసేలా శరీర రోగ నిరోధక వ్యవస్థను ఈ ప్రొబయోటిక్ బ్యాక్టీరియా సిద్ధం చేస్తుందని పరిశోధకులు తెలిపారు.

ఎలా పని చేస్తుంది ?

ఈ వ్యాక్సిన్ శరీరంలో బ్యాక్టీరియా నియోయాంటిజెన్స్ అనే ప్రొటీన్ లక్ష్యాలను ఉత్పత్తి చేస్తాయి. ఇవి క్యాన్సర్ కణాలను పోలి ఉంటాయి. క్యాన్సర్ కణాలను గుర్తించి, దాడి చేసేలా రోగ నిరోధక వ్యవస్థను నియోయాంటిజెన్లు సిద్ధం చేస్తాయి. ఒకవేళ శరీరంలోని లక్ష్యాన్ని గుర్తించడంలో విఫలమైతే ఈ వ